క్లుప్తంగా

గోశాలకు విరాళాలు



విరాళాలు అందజేస్తున్న దాతలు

అమలాపురం టౌన్: స్థానిక శ్రీ గౌతమ మహర్షి గో సంరక్షణ సమితి గోశాలలో ఆశ్రయం పొందుతున్న గోవులకు ఎండు గడ్డి, పచ్చ గడ్డి, దాణాల కోసం పలువురు దాతలు విరాళాలు సమకూర్చారు. స్థానిక దక్షణేశ్వర శ్రీ కాలభైరవ శక్తి స్థల్‌లో అక్షయ పాత్ర సంస్థ నిర్వహిస్తున్న వేసవి చలి వేంద్రం వద్ద దాతలు గోశాల సేవలకులకు ఈ విరాళాలను శుక్రవారం అందజేశారు. పట్టణానికి చెందిన నల్లా కన్నబాబు, శ్రీదేవి దంపతులు రూ.12 వేలు, అన్నంనీడి బాబు వీరేంద్ర, లావణ్య దంపతులు రూ.15 వేలు, మోరం వెంకట్రావు, రమా ప్రసాద్ రూ.18 వేలు, సలాది శ్రీనివాస్ రూ.12 వేలు సమకూర్చారు.

23న శ్రీసురభి గోరక్ష దీక్షా యాగం

అమలాపురం టౌన్: అమలాపురం ఎర్ర వంతెన వద్ద గల గీతాశ్రమంలో ఈ నెల 23వ తేదీన శ్రీ సురభి గోరక్ష దీక్షా యాగాన్ని నిర్వహిస్తున్నట్లు యాగ నిర్వాహకులు కిరణ్‌శర్మ, ఆ ఆశ్రమ ప్రతినిధులు ఆకుల బాబి, కోకా రాంబాబు సంయుక్తంగా విడుదల చేసిన ఓ ప్రకటనలో వెల్లడించారు. 23వ తేదీ నుంచి ఆరు రోజుల పాటు జరిగే ఈ యాగం లక్ష గో పిడకలతో నిర్వహిస్తామన్నారు. యాగ నిర్వహణ బృందం అమలాపురంలో పలువురిని స్వయంగా కలిసి ఆహ్వాన పత్రాలను శుక్రవారం అందజేసింది.

డిప్యూటీ తహసీల్దార్‌కు పుదుచ్చేరి బదిలీ

యానాం: రెవెన్యూశాఖ డిప్యూటీ తహసీల్దార్ (డీటీ)గా సుదీర్ఘకాలం పనిచేసిన జి.సత్యనారాయణన్‌ను పుదుచ్చేరికి బదిలీ చేస్తూ శుక్రవారం డిపార్ట్‌మెంట్ ఆఫ్ రెవెన్యూ అండ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ కార్యదర్శి ఇ.వల్లవన్ ఆదేశాలు జారీచేశారు. సత్యనారాయణన్‌ను పుదుచ్చేరి రిజిస్ట్రేషన్ శాఖలో డిప్యుటేషన్‌పై సబ్ రిజిస్ట్రార్‌గా నియమించారు. కొత్త డీటీ నియామకం జరిగే వరకు తూనికలు, కొలతల శాఖ డీటీ సి.గణేషన్ రెవెన్యూశాఖ డీటీగా అదనపు బాధ్యతలతో వ్యవహరిస్తారని ఆదేశాల్లో పేర్కొన్నారు.

టీడీపీ మినీ మహానాడు

అమలాపురం టౌన్: డాక్టర్ మెట్ల సత్యనారాయణరావు కాపు కల్యాణ మంటపంలో టీడీపీ మినీ మహానాడు శుక్రవారం జరిగింది. జిల్లా పార్టీ అధ్యక్షురాలు రెడ్డి అనంత కుమారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసన సభ మాజీ స్పీకర్ కె. ప్రతిభాభారతి ముఖ్య అతిథిగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. ప్రతిభా భారతి తన ప్రసంగంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై విమర్శలు చేశారు. శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు, మాజీ ఎమ్మెల్యేలు బండారు సత్యానందరావు, అయితా బత్తుల ఆనందరావు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి మెట్ల రమణబాబు ప్రసంగించారు.

ఉచిత మెగా వైద్య శిబిరం రేపు

యానాం: లయన్స్‌క్లబ్ పిల్లారాయ యానాం ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు క్లబ్ అధ్యక్షుడు పులపర్తి శ్రీను ప్రకటనలో తెలిపారు. ఆరోజు స్థానిక మహాత్మాగాంధీ ప్రభుత్వ బాలుర హైస్కూల్ ప్రాంగణంలో ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించే వైద్యశిబిరంలో భాగంగా బీపీ, సుగర్, ఎముకలు, ప్రసూతి, చెవి, ముక్కు, గొంతు, గుండె సంబంధిత వ్యాధులకు వైద్యం అందిస్తారన్నారు. ఉచితంగా మందులు అందిస్తారన్నారు.

నదిలోకి దూకిన యువకుడు

- తాళ్ల సహాయంతో కాపాడిన లారీ డ్రైవర్




నదిలో మునిగిపోకుండా ఉన్న విద్యార్థిని కాపాడుతున్న బోటు యజమాని

అల్లవరం: అమలాపురం నారాయణపేటకు చెందిన ఓ విద్యార్థి శుక్రవారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో బోడసకుర్రు బ్రిడ్జిపై నుంచి వైనతేయ నదిలోకి దూకి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. బ్రిడ్జిపై నుంచి అటుగా వెళ్తున్న లారీ డ్రైవర్ నదిలోకి దూకడాన్ని గుర్తించి మునిగిపోతున్న యువకుడిని కాపాడేందుకు తాళ్లు అందించాడు. లారీ డ్రైవర్ అందించిన తాళ్ల సహాయంతో నదిలో ఉన్న విద్యార్థి మునిగిపోకుండా ఉన్నాడు. చేపల వేట సాగిస్తున్న ఎం.నాగరాజు ఘటనా స్థలానికి చేరుకుని విద్యార్థిని బోటులో ఎక్కించుకుని ఒడ్డుకి చేర్చారు. విద్యార్థిని కాపాడిన లారీడ్రైవర్, బోటు యజమానిని స్థానికులు అభినందించారు.

పరిశ్రమల మూత.. ఉపాధికి కోత

- యానాంలో కార్మికుల వలసబాట
- పెరుగుతున్న నిరుద్యోగం
- ఏపీ రొయ్యల ఫ్యాక్టరీల్లో పనికి వెళుతున్న వైనం



మూతపడ్డ రీజెన్సీ పరిశ్రమ



దొమ్మేటిపేటలో మూతపడ్డ బ్లజూమ్స్ ఆయిల్ ఫ్యాక్టరీ

యానాం: వేలాదిమందికి ఉపాధి కల్పించిన పరిశ్రమలు ఒక్కొక్కటి మూసివేత దిశగా సాగుతుండటంతో యానాంలో ఉపాధి దొరకని పరిస్థితిలో వందలాదిమంది నిరుద్యోగులు కొట్టుమిట్టాడుతున్నారు. ఇప్పటికే మూసివేసిన పరిశ్రమల్లో పనిచేసిన కార్మికులు దిక్కుతోచని స్థితిలో వలసబాట పడుతున్నారు. కేంద్రపాలిత ప్రాంతంగా యానాంకు 1990 నుంచి అనేక పారిశ్రామిక రాయితీలు ప్రభుత్వం ఇవ్వడంతో వందలాదిగా చిన్న, మధ్యతరహా, భారీ పరిశ్రమలు సుమారు 250 వరకు స్థాపించారు. ఆ విధంగా నియోజకవర్గానికి శివారున నున్న దరియాలతిప్ప, దొమ్మేటిపేట, సీతారామనగర్, ఇండస్ట్రియల్ ఏరియా, మెట్టకూరులలో అనేక పరిశ్రమలు స్థాపించారు. రెడ్డీల్యాబ్స్ వంటి ప్రముఖ ఫార్మాస్యూటికల్స్, పాలిమర్, ప్లాస్టిక్, ఫుడ్ ప్రొడక్ట్స్, పేపర్ ప్రొడక్ట్స్, అట్టల ఫ్యాక్టరీలు, స్టీలు, రైస్ ఇండస్ట్రీస్, కార్బైడ్, కెమికల్, జింక్, ఆక్వాఫీడ్, తదితర మధ్య తరహా పరిశ్రమలు ఉండేవి. రీజెన్సీ సిరామిక్స్ పరిశ్రమ స్థాపన జరగడంతో యానాంతో పాటు పరిసర ప్రాంతాలకు చెందిన వేలాదిమంది ఉపాధి పొందేవారు. ఆవిధంగా యానాం ప్రాంతం కార్మికుల కుటుంబాలతో కళకళలాడేది.

మూసివేత దిశగా ...

ప్రస్తుతం వివిధ కారణాలతో పరిశ్రమలు మూసివేస్తుండటంతో కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 2012 జనవరి 27న జరిగిన రీజెన్సీ పరిశ్రమ దుర్ఘటన జరిగిన అనంతరం వేలాదిమంది కార్మికులు వీధిన పడ్డారు. ఈ నేపథ్యంలో అనేక చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు కార్మికులు తరలివెళ్లిపోగా కొంతమంది ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిపోయారు. అయితే ప్రస్తుతం చిన్నతరహా పరిశ్రమలు కూడా మూసివేయడంతో కార్మికులకు ఉపాధి దొరకని పరిస్థితి ఎదురవుతోంది. రైస్‌మిల్లుల్లో సైతం వందలాదిమంది జట్టు కార్మికులకు ఉపాధి దొరికేది. ప్రస్తుతం వాటిని కూడా మూసివేసే పరిస్థితి వచ్చింది. పలు పరిశ్రమలు రాయితీలు అనుభవించి మూసివేయడం ఒక కారణం కాగా, ఇటీవలి వచ్చిన జీఎస్టీ పన్ను కూడా కారణంగా చెబుతున్నారు.

నిరుద్యోగులు విలవిల... మార్గదర్శనం కరవు

పరిశ్రమలు మూసివేయడంతో యానాం నియోజకవర్గ పరిధిలోని వందలాదిమంది నిరుద్యోగులు ఉపాధి దొరకక విలవిలలాడుతున్నారు. ముఖ్యంగా యానాంలో ఇంజినీరింగ్, ఐటీఐ, పాలిటెక్నిక్ తదితర కళాశాలలు ఉన్నాయి. వీటి నుంచి వందలాదిమంది ఏటా విద్యను పూర్తిచేసుకుని బయటకు వస్తున్నారు. కాని వారికి ఉద్యోగం మాట దేవుడెరుగు అప్రెంటిస్‌షిప్ దొరకడమే గగనమయిపోతోంది. టెక్నికల్ శిక్షణ పూర్తిచేసుకున్న తరువాత స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లు ఏర్పాటు చేసి వారికి మరింత నైపుణ్య శిక్షణ ఇవ్వాల్సివుంది. ఆవిధంగా సాంకేతిక ఉద్యోగాలకు సంబంధించి గైడెన్స్ ఇవ్వాల్సి వుంది. కాని యానాంలో అటువంటివి లేకపోవడంతో ఎటు వెళ్లాలో తెలియని పరిస్థితి నెలకొంది. మహిళా కార్మికులు తాళ్లరేవు మండల పరిధిలోని రొయ్యల ఫ్యాక్టరీలకు ఉపాధి కోసం వెళుతున్నారు.

ఫ్యాక్టరీలు తెరిపించేందుకు చొరవ చూపాలి

పుదుచ్చేరికి 870 కిలోమీటర్ల దూరంలో యానాం ప్రాంతం వుంది. నిరుద్యోగులకు ఉద్యోగ పరమైన నోటిఫికేషన్ల సంబంధించి సరైన సమాచారం ఉండని పరిస్థితి. స్థానికంగా ఉపాధి కల్పించేలా మూతపడిన ఫ్యాక్టరీలను తెరిపించేందుకు అధికారులు, ఎమ్మెల్యే తదితరులు ఆయా యాజమాన్యాలతో సంప్రదింపులు జరిపేలా చొరవ చూపాలని స్థానికులు కోరుతున్నారు. పారిశ్రామికరంగ పాలసీలను వారికి వివరించాలని కోరుతున్నారు.

మూతపడిన పరిశ్రమలు తెరిపించాలి... రాయితీలు ఇవ్వాలి

మూతపడిన పరిశ్రమలును తెరిపించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, ఆ దిశగా ప్రయత్నాలు చేయాలని పలు కార్మిక సంఘాలు విజ్ఞప్తి చేస్తున్నాయి. యానాం అభివృద్ధికి అది ఒక్కటే మార్గమని పేర్కొంటున్నాయి.

ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి



యానాంలో వివిధ కారణాలతో పరిశ్రమలు ఒక్కోటి మూతపడ్డాయి. ఉపాధికి ఇబ్బందులు ఉన్నాయి. దీంతో ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాలకు వలస వెళుతున్నారు. మూతపడ్డ భారీ పరిశ్రమను తిరిగి తెరిచేలా సంబంధిత యాజమాన్యంతో మాట్లాడుతున్నాను. ప్రభుత్వ పరంగా చర్యలు తీసుకోవాల్సి వుంది.
– ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్

ప్రోత్సాహకాలు ఇవ్వాలి



ప్రభుత్వం పారిశ్రామిక రంగాన్ని ప్రోత్సహించక పోవడమే పరిశ్రమల మూసివేతకు కారణం. ప్రోత్సాహకాలు ప్రకటించి పరిశ్రమల స్థాపనకు కృషి చేయాలి. అప్పుడే నిరుద్యోగ సమస్య పరిష్కారం అవుతుంది.
– నబ్బతి శ్రీనివాసరావు, దరియాలతిప్ప గ్రామపెద్ద

వంతెన కూల్చివేతలో తప్పిన ప్రమాదం



వంతెన శిథిలాలు తొలగిస్తుండగా ఒరిగిపోయిన పొక్లెయిన్

అల్లవరం: గుడ్డివానిచింత నుంచి సామంతకుర్రు వరకు ఆర్‌అండ్‌బీ రోడ్డు విస్తరణలో భాగంగా ఎంట్రుకోన వద్ద కాలువపై ఉన్న వంతెనను తొలగించి దాని స్థానంలో కొత్త వంతెన నిర్మాణానికి రెండు రోజుల కిత్రమే భూమిపూజ నిర్వహించారు. శుక్రవారం మధ్యాహ్నం పొక్లెయిన్ సహాయంతో వంతెన శిథిలాలను తొలగిస్తుండగా ఒక్కసారిగా వంతెన కూలిపోయింది. ఈ ప్రమాదంలో పొక్లెయిన్ డ్రైవర్ సురక్షితంగా బయటపడ్డారు. ప్రమాద స్థలంలో ఎవరూ లేకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

మట్టి అక్రమ రవాణాకు బ్రేక్

కాట్రేనికోన: స్థానికుల ఫిర్యాదు మేరకు మైనింగ్ అధికారులు దాడి చేయడంతో మట్టి అక్రమ రవాణాకు బ్రేక్ పడింది. పల్లం మంచినీటి చెరువు అభివృద్ధి పనులకు మట్టిని మైనింగ్ అనుమతులు లేకుండా తరలిస్తున్నారు. గురువారం రాత్రి మైనింగ్ అధికారులు కాపు కాయడంతో మట్టిని తరలించడం నిలిపివేశారు. పల్లంలో ప్రభుత్వం నుంచి అనుమతులు లేకుండా సిద్ధం చేస్తున్న అక్రమ లే అవుట్‌కు మైనింగ్ అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను కాట్రేనికోన డిప్యూటీ తహసిల్దారు ఝాన్సీ, ఆర్ఐ సత్యవతి సీజ్ చేసి కాట్రేనికోన ఎస్సై టి. శ్రీనివాస్‌కు అప్పగించారు.

గడపగడపకూ సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



గోపవరంలో సంక్షేమ వివరాలను లబ్ధిదారునికి అందిస్తున్న శ్రీకాంత్ తదితరులు

ఉప్పలగుప్తం: గడపగడపకు సంక్షేమ పథకాలు అందే దిశగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ తనుయుడు శ్రీకాంత్ అన్నారు. మండలంలోని గోపవరంలో గ్రామంలో శుక్రవారం అధికారులతో కలసి గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలో పథకాలు వివరిస్తూ.. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అందరికీ అందుబాటులో సచివాలయ వ్యవస్థను, రైతు భరోసా కేంద్రాన్ని, వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లను ఏర్పరిచిందన్నారు. నాడు–నేడు పథకంలో పాఠశాల భవనాలను ఆధునీకరించి, విద్యార్థులకు మంచి పోషకాలతో కూడిన ఆహారాన్ని అందించటమే కాకుండా కార్పొరేట్ తరహాలో బోధనను అందిస్తున్నారన్నారు. సర్పంచ్ కుంచే బుల్లియ్య, జెడ్పీటీసీ సభ్యుడు గెడ్డం సంపదరావు, ఎంపీటీసీ సభ్యుడు కొంకి ఏడుకొండలు, మండల పార్టీ అధ్యక్షుడు బద్రిబాబ్జి, ఆర్‌బీకే మండల చైర్మన్ మానే శ్రీను, సొసైటీ అధ్యక్షుడు అడపా రమేష్ పాల్గొన్నారు.

పీడిత ప్రజల ఆశాజ్యోతి పుచ్చలపల్లి



సుందరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు, సీపీఎం నాయకులు

అమలాపురం టౌన్: పీడిత ప్రజల ఆశాజ్యోతి పుచ్చలపల్లి సుందరయ్య అని ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు అన్నారు. పుచ్చలపల్లి సుందరయ్య 32వ వర్ధంతి సందర్భంగా స్థానిక గడియారం స్తంభం సెంటరులో శుక్రవారం జరిగిన సభలో ఆయన ప్రసంగించారు. జిల్లా సీపీఎం కమిటీ, పలు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జరిగిన ఈ సభలో తొలుత ఎమ్మెల్సీతోపాటు పార్టీ నాయకులు కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఎం ఆధ్వర్యంలో ఆ సెంటరులో చలివేంద్రాన్ని ఎమ్మెల్సీ ప్రారంభించారు. పార్టీ జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు, నాయకులు భీమాల శ్రీను, దైవ కృప, మణి మాల, నాగలక్ష్మి పాల్గొన్నారు. ఇటీవల మృతి చెందిన కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు దివంగత పచ్చిమాల వసంతకుమార్ చిత్రపటానికి కూడా నాయకులు నివాళులర్పించారు.

తాళ్లరేవులో..

తాళ్లరేవు: కమ్యూనిస్టు ఉద్యమ నేత పుచ్చలపల్లి సుందరయ్య 38వ వర్ధంతిని శుక్రవారం తాళ్లరేవులో నిర్వహించారు. సీపీఎం జిల్లా నాయకుడు కేఎస్ శ్రీనివాస్, మండల నాయకుడు టేకుమూడి ఈశ్వరరావు, నాయకులు సీహెచ్ శ్రీనివాస్, ఉంగరాల వెంకటేశ్వరరావు, అత్తిలి బాబూరావు సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన పేరు మీద ఎండీయూ డబ్ల్యూఏ అధ్యక్షుడు పెయ్యల రమేష్ సహకారంతో స్థానిక సంతపేట సెంటర్‌లో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించారు.

కాట్రేనికోనలో..

కాట్రేనికోన: కమ్యూనిస్టు నాయకుడు పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి కాట్రేనికోనలో శుక్రవారం జరుపుకున్నారు. సీపీఎం నాయకుడు విత్తనాల రాంబాబు అధ్యక్షతన పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి జరిగింది. ఆయన చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. విప్పర్తి మోహన్‌రావు, బ్రహ్మాజీ, వెంకటరమణ, ఏడు కొండలు పాల్గొన్నారు.

పైప్‌లైన్ నిర్మాణ పనుల పరిశీలన

అమలాపురం రూరల్: కామనగరువు చిట్టమ్మ చెరువు ప్రాంతంలో మంచినీటి సమస్య ఎక్కువగా ఉండటం వలన జాతీయ రహదారి వద్ద నూతనంగా ఏర్పాటు చేస్తున్న పైప్‌లైన్ నిర్మాణ పనులను మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షురాలు, సర్పంచ్ నక్కా అరుణకుమారి పరిశీలించారు. త్వరితగతిన పనులు పూర్తి చేసి ప్రజలకు తాగునీరు అందించాలని కార్యదర్శి ఎ.రాజేశ్వరరావును ఆదేశించారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో జరిగిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సోషల్ ఆడిట్‌లో సర్పంచ్ అరుణకుమారి పాల్గొని పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సోషల్ ఆడిట్ డీఆర్పీ పెంకి ప్రసాద్, జూనియర్ అసిస్టెంట్ ఆదినారాయణ, నక్కా చంద్రశేఖర్, ఫీల్డ్ అసిస్టెంట్ కిరణ్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి కుటుంబానికి యూటీఎఫ్ చేయూత



చెక్కు అందిస్తున్న ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు, యూనియన్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: కాట్రేనికోన మండలం చెయ్యేరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ ఆకస్మికంగా మృతి చెందిన ఎ.బంగారయ్య కుటుంబానికి స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో శుక్రవారం రూ.3 లక్షల చెక్‌ను ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు చేతుల మీదుగా అందజేశారు. యూటీఎఫ్ కుటుంబ సంక్షేమ పథకం జిల్లా అధ్యక్షుడు ఎన్.విశ్వనాథ్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.జ్యోతిబసు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలను పాటించాలి

అల్లవరం: స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఆటో డ్రైవర్లు, ద్విచక్ర వాహనదారులు, పౌరులకు రోడ్డు భద్రతా నియమాలపై ఎస్ఐ శ్రీను నాయక్ శుక్రవారం అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ వాహనదారులు నియమ నిబంధనలు పాటించాలన్నారు. డ్రైవింగ్ చేసే ప్రతి ఒక్కరూ లైసెన్స్ పొంది ఉండాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు తలకు హెల్మెట్ ధరించాలన్నారు. వాహనాలకు సంబంధించిన అన్ని డాక్యుమెంట్లు లైసెన్స్, ఆర్‌సీ, పొల్యూషన్, ట్యాక్స్ పత్రాలు కలిగి, పోలీస్ అధికారులు తనిఖీలు చేసినప్పుడు చూపించాలని ఎస్ఐ తెలిపారు. అనంతరం మహిళలకు దిశ చట్టంపై అవగాహన కల్పించారు. ఏఎస్ఐలు జంగా సత్యనారాయణ, కృష్ణారెడ్డి, పోలీస్ సిబ్బంది, డ్రైవర్లు పాల్గొన్నారు.

అమృత్ సరోవర్ పనుల పరిశీలన



గొల్లవిల్లిలో ఉపాధి పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ శ్రీదుర్గ

ఉప్పలగుప్తం: మండలంలోని గొల్లవిల్లి గ్రామంలో ముమ్మరంగా జరుగుతున్న అమృత్ సరోవర్ పనులను సర్పంచ్ జొన్నాడ శ్రీదుర్గ శుక్రవారం పరిశీలించారు. గొల్లవిల్లి యల్లారమ్మ చెరువుకు 7.5 లక్షల విలువైన అమృత్ సరోవర్ పనులు మంజూరయ్యాయి. ఈ పనులను సర్పంచ్ పరిశీలించి ఉపాధి కూలీలకు సూచనలు చేశారు. ఎంపీటీసీ సభ్యురాలు దోనిపాటి బాలమ్మ, ఏపీవో వి.రాజామణి, ఫీల్డ్ అసిస్టెంట్ ఎం.ధనలక్ష్మి పాల్గొన్నారు.

లబ్ధిదారుల దరఖాస్తుల పరిశీలన

యానాం: ఓఎన్‌జీసీ చేపట్టిన రెండవ గ్యాస్ పైపు లైను నిర్మాణం నేపథ్యంలో నష్టపోతున్న యానాం నియోజకవర్గ పరిధిలోని మత్స్యకారులకు ఆ సంస్థ నష్టపరిహారం మంజూరు చేసింది. పరిహారం కోసం లబ్ధిదారులు చేసుకున్న దరఖాస్తుల పరిశీలన కార్యక్రమాన్ని శుక్రవారం మత్స్యశాఖ ఆఫీసులో ఆర్‌పీఓ మునిస్వామి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా త్వరతగతిన దరఖాస్తులను స్క్రూటినీ నిర్వహించి ఎంపిక ప్రక్రియను చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఫిషరీస్ ఏడీ దడాల గొంతియ్య, సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ హిత జీవనశైలిపై సదస్సు

అమలాపురం రూరల్: పర్యావరణ హిత జీవన శైలిపై అమలాపురం ఏరియా ఆసుపత్రిలో శుక్రవారం అవగాహ సదస్సు నిర్వహించారు. సూపరింటెండెంట్ డాక్టర్ శంకర్రావు మాట్లాడుతూ విద్యుత్, నీటిని పొదుపుగా వాడాలని, ప్లాస్టిక్ ఒక్కసారి మాత్రమే వాడాలన్నారు. ఎలక్ట్రానిక్ వ్యర్థాలు తగ్గించాలన్నారు. చిన్నపిల్లల వైద్యులు బి.జయరాంజీ బాబు మాట్లాడుతూ ఆరోగ్యకరమైన జీవన శైలిని అలవర్చుకోవాలని, నీటిని వృథా చేయవద్దు అని ప్రతిజ్ఞ చేయించారు. వైద్యులు సౌమ్య, శేషుతోపాటు నర్సులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలను చేర్పించాలి

తాళ్లరేవు: బడి ఈడు పిల్లలను గుర్తించి ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరంగి పంచాయతీ చినబొడ్డు వెంకటాయపాలెం జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం కె.సాయిప్రసాద్ కోరారు. శుక్రవారం స్థానిక పాఠశాలలో ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌పై వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. వలంటీర్లు ప్రత్యేక దృష్టిపెట్టి బడి బయట ఉన్న పిల్లలందరినీ పాఠశాలలో చేర్పించాలని కోరారు. స్కూల్ కమిటీ చైర్మన్ ఆర్.సుగంధరత్నం, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్, మహిళా పోలీస్, వలంటీర్లు హాజరయ్యారు.

డిప్యూటీ డైరెక్టర్‌గా పదోన్నతి

యానాం: స్థానికుడైన బడుగు ఈశ్వరరావును పుదుచ్చేరి డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎకనామిక్స్ అండ్ స్టాటిస్టిక్స్ డిప్యూటీ డైరెక్టర్(గ్రూప్–బి గెజిటెడ్) నియమిస్తూ శుక్రవారం ఆర్థికశాఖ డిప్యూటీ సెక్రటరీ రతన్‌ఘోష్ చారి ఆదేశాలు జారీచేశారు. ఇప్పటివరకు అదే శాఖలో స్టాటిస్టిక్స్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయనకు పుదుచ్చేరి ప్రభుత్వం పదోన్నతి కల్పించింది. ఈశ్వరరావు గతంలో సమాచారశాఖ తదితర శాఖల్లో సేవలు అందించారు.

ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్‌ను ప్రారంభించిన చైర్మన్ ప్రవీణ్



ఆర్‌ఆర్‌ఆర్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్ ప్రవీణ్‌కుమార్ తదితరులు

ముమ్మిడివరం: కేంద్ర కాలుష్య నియంత్రణ బోర్డు ఆదేశాల మేరకు ముమ్మిడివరం నగర పంచాయతీ కార్యాలయంలో ఆర్‌ఆర్‌ఆర్(రెడ్యూస్, రీయూజ్,రీసైక్లింగ్) సెంటర్‌ను శుక్రవారం చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఈ కేంద్రం ద్వారా పాత పుస్తకాలు, పాత ప్లాస్టిక్ వస్తువులు, ఫర్నీచర్, పాత చెప్పులు, బూట్లు, ఎలక్ట్రికల్ సామాన్లు సేకరిస్తామన్నారు. వాటిని పేదలు, అనాథ శరణాలయాలకు అందిస్తామన్నారు. పాత వస్తువులు సేకరించడం ద్వారా పరిసరాల పరిశుభ్రత, కాలుష్య నివారణ దిశగా ఈ కేంద్రం పనిచేస్తుందన్నారు. ఈ కేంద్రం ఉదయం 7 నుంచి 10 గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంటుందన్నారు. కమిషనర్ జి.లోవరాజు, మేనేజర్ పి.నూకరాజు, ఏఈ కె.సత్యనారాయణ, హెల్త్ అసిస్టెంట్ జీఎస్ఎన్‌రాజు పాల్గొన్నారు.

జాతీయ స్థాయికి ఎదగాలి



టోర్నీ ప్రారంభ సభలో మాట్లాడుతున్న ఆర్‌పీఓ మునిస్వామి

- సియేచెమ్–2023 టోర్నీ ప్రారంభం

యానాం: సాధనతో జాతీయ స్థాయి క్రీడాకారులుగా తయారుకావాలని, ఆ విధంగా తమ నైపుణ్యాలను వెలికితీయాలని ఆర్‌పీఓ మునిస్వామి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక మెట్టకూరు ప్రభుత్వ హైస్కూల్ క్రీడామైదానంలో పుదుచ్చేరి క్రికెట్ అసోసియేషన్ గుర్తింపు పొందిన యానాం డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సియేచెమ్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. లీగ్‌కమ్ నాకౌట్ పద్ధతిలో ఈ నెల 30వరకు జరిగే ఈ టోర్నీలో నియోజకవర్గ పరిధిలోని మొత్తం 10 జట్లు తలపడుతున్నాయి.

మొదటిరోజు హోరాహోరీగా ...

మొదటి రోజు రామా యూత్, నాగా ఎలెవెన్ జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. మొదట బ్యాటింగ్ చేసిన రామా యూత్ 97 పరుగులు చేయగా అనంతరం బ్యాటింగ్ చేసిన నాగా ఎలెవెన్ 98 పరుగులు చేసి విజయం సాధించింది. రెండో మ్యాచ్ రాంజీ యంగ్ మెన్స్ క్లబ్, అంబేడ్కర్ ఎలెవెన్ జట్ల మధ్య జరిగింది. మొదటగా రాంజీ యంగ్‌మెన్స్ క్లబ్ 108 పరుగులు చేయగా అంబేడ్కర్ ఎలెవన్ జట్టు 87కు ఆలౌట్ అవడంతో రాంజీ యంగ్ మెన్స్ క్లబ్ విజయంసాధించింది. ఎస్పీ రఘునాయగం, సీఐ షణ్ముగం, వైడీసీఏ అధ్యక్షుడు పంతగడ రమేష్, కార్యదర్శి కూనపురెడ్డి సుబ్బారావు, సత్యం, ప్రసాద్ పాల్గొన్నారు.

పిచ్చికుక్క స్వైర విహారం

- పది మందిపై దాడి

ఉప్పలగుప్తం: మండలంలోని పలు గ్రామాల్లో పిచ్చికుక్క స్వైర విహారం చేస్తూ శుక్రవారం నాలుగు గ్రామాల్లో పది మందిపై దాడి చేసింది. పిచ్చికుక్క వాడపర్రు గ్రామంలో నలుగురిని, గొల్లవిల్లిలో ఒకరిని, సన్నవిల్లిలో నలుగురిని, గాడవిల్లిలో ఒకరిని కరిచినట్టుగా ఉప్పలగుప్తం సిబ్బంది తెలిపారు. వీరికి పీహెచ్‌సీలో ప్రాథమిక చికిత్స అందించి అమలాపురం ఏరియా ఆసుపత్రి మెరుగైన వైద్యం కోసం పంపించారని వైద్యాధికారులు ఎల్.నాగార్జున తెలిపారు. నాలుగు గ్రామాల్లో దాడి చేసుకుంటూ పిచ్చికుక్క తిరగటంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. దీనిని గమనించి పంచాయతీ అధికారులు రక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రాష్ట్ర స్థాయిలో విజేతలై రావాలి



క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలుపుతున్న అసోసియేషన్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: తెనాలిలో నేడు, రేపు జరగనున్న 10వ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్, జూనియర్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు విజేతలుగా నిలవాలని అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. స్థానిక హెల్త్ అండ్ ఫిట్‌నెస్ జిమ్‌లో శుక్రవారం ఉదయం సమావేశమై విజయ వ్యూహాలపై చర్చించారు. జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు యెనుముల కృష్ణ పద్మరాజు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు వంటెద్దు వెంకన్నాయుడు ముఖ్య అతిథిగా ప్రసంగించారు. జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు నగభేరి కృష్ణమూర్తి, జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ కంకిపాటి వెంకటేశ్వరరావు, జిల్లా పవర్ లిఫ్టింగ్, బాడీ బిల్డింగ్ అసోసియేషన్ల ప్రతినిధులు క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు.